# చదువు

గ్రామ, వార్డు సచివాలయ పరీక్షల ప్రత్యేకం



చరిత్ర- ప్రిపరేషన్ విధానం



**గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల రాత పరీక్ష సిలబస్‌లో 'భారతదేశ చరిత్ర, సంస్కృతి - ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి' అని ఇచ్చారు. ఒక వాక్యంగానే కనిపించినప్పటికీ దాని పరిధి చాలా విస్తృతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏం చదవాలి, ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించి ఎలా సమన్వయం చేసుకోవాలి.. తదితరాలపై అభ్యర్థులు అవగాహన ఏర్పరచుకోవాలి.**

# సమన్వయంతో సాగాలి అధ్యయనం!

సిలబస్‌లో 'భారతదేశ చరిత్ర- సంస్కృతి' అని ప్రస్తావించారు కాబట్టి రాజకీయ చరిత్ర కంటే నాటి ఆర్థిక, సాంఘిక, మత, సాంస్కృతిక అంశాలపై అధికంగా దృష్టి సారించాలి. శాతవాహనయుగం, తూర్పు చాళుక్యయుగం, కాకతీయ యుగం, విజయనగర సామ్రాజ్యం, కుతుబ్ షాహీ కాలంనాటి పరిస్థితులు, ఆంగ్లేయుల పాలనలో ఆంధ్రదేశం, స్వాతంత్రోద్యమంలో ఆంధ్రులపాత్ర లాంటి అంశాలను అధ్యయనం చేయాలి.

శాతవాహన యుగంలో మొదటి శాతకర్ణి, కుంతల శాతకర్ణి, గౌతమీ పుత్ర శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణిల కాలం నాటి పరిస్థితులపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. హాలుడు (గాథాసప్తశతి), గుణాఢ్యుడు (బృహత్కథ) శర్వవర్మ (కాతంత్ర వ్యాకరణం) నాగార్జునుడి రచనల వివరాలను చదవాలి. అమరావతి శిల్పకళ, వాస్తు నిర్మాణాల గురించి తెలుసుకోవాలి. ఇక్ష్వాకులు, వారి రాజధాని విజయపురి, ఆ కాలంలో అభివృద్ధి చెందిన నాగార్జునకొండ, బౌద్ధమతవ్యాప్తి వంటి విషయాలు పరీక్షల కోణంలో ముఖ్యమైనవి. తూర్పు చాళుక్యులు కుబ్జవిష్ణువర్ధనుడు (స్థాపకుడు), మొదటి జయసింహవల్లభుడు (విప్పర్ల శాసనం), మొదటి చాళుక్య భీముడు (పంచారామాల అభివృద్ధి) గుణగ విజయాదిత్యుడు (అందరిలో గొప్పవాడు), అతడి సేనాని పాండురంగడు (అద్దంకి శాసనం), రాజరాజనరేంద్రుడు వంటి రాజుల కాలం నాటి భాషాసాహిత్యాల వికాసం, వాస్తుకళారంగాల అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలి. తొలి రాజధాని వేంగి, రెండో రాజధాని రాజమహేంద్రవరం, ఆదికవి నన్నయ్య లాంటి విషయాలపై దృష్టి పెట్టాలి.

విజయనగర సామ్రాజ్యం, శ్రీకృష్ణదేవరాయల ఘనత, విదేశీ యాత్రికులు, వారి వ్యాఖ్యలు, తెలుగు సాహిత్యాభివృద్ధి, అష్టదిగ్గజాల రచనలు, అప్పటి దేవాలయాలు, వాస్తు కళారంగాల అభివృద్ధి గురించి తెలుసుకోవాలి. న్యూనిజ్, బార్బోసా, డొమింగోపెయిస్, అబ్దుల్‌రజాక్ లాంటి విదేశీ రాయబారుల రచనల్లో పేర్కొన్న అంశాలను అధ్యయనం చేయాలి. కుతుబ్‌షాహీ పాలకుల కాలంనాటి తెలుగు భాషాకవుల పోషణ, నాటి సాంఘిక మత విషయాలు, కంచర్ల గోపన్న (భక్త రామదాసు) చరిత్ర, ఇబ్రహీంకులీ, మహమ్మద్‌కులీ, తానీషా పాలకుల కాలం నాటి ప్రాధాన్యాంశాలపై దృష్టిపెట్టాలి. ఆంధ్రదేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించిన విధానం అంటే ఉత్తర సర్కారులు, దత్త మండలాలు, నెల్లూరు చిత్తూరు జిల్లాలను ఎలా ఆక్రమించుకున్నారు, కారణాలను తెలుసుకోవాలి. విభజించి పాలించు విధానం ద్వారా ఘర్షణలను ఎలా సృష్టించారు, 1757 నాటి బొబ్బిలియుద్ధం, 1794 పద్మనాభయుద్ధం, జమీందారులు, పాలెగాళ్ల తిరుగుబాటులు, కంపెనీ ఆంగ్ల ప్రభుత్వ పాలనా ప్రభావాలు, సాంస్కృతిక పునరుజ్జీవనం కందుకూరి, రఘుపతి వెంకటరత్నం నాయుడు లాంటి సంఘ సంస్కర్తల సేవలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా భారత జాతీయోద్యమంలో భాగంగా ఆంధ్రదేశంలో జరిగిన వందేమాతర, హోంరూల్ ఉద్యమాలు, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల గురించి ప్రత్యేకంగా చదవాలి. మరీ ముఖ్యంగా ఆంధ్రోద్యమం, ఆంధ్రరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ అవతరణ కాలం నాటి ముఖ్యాంశాలు, జై తెలంగాణ (1969) జై ఆంధ్ర ఉద్యమాలు (1972), ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు (2014) లాంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలి.

## కాకతీయుల నుంచి రెడ్డి రాజుల వరకు

కాకతీయ యుగంలో రుద్రదేవుడు (స్వతంత్ర రాజ్యస్థాపకుడు), గణపతిదేవుడు, రుద్రమదేవి పాలనా విశేషాలు, నాయంకర పద్ధతి (సైనిక విధానం), వాస్తు నిర్మాణాలు (వేయిస్తంభాల గుడి, రామప్పగుడి), తెలుగు, సంస్కృత భాషా రచనలు, మత, ఆర్థిక, సాంఘిక అంశాలను చదవాలి. రుద్రమదేవి కాలంలో వచ్చిన మార్కోపోలో వ్యాఖ్యలు, మోటుపల్లి ఓడరేవు ప్రాధాన్యాలను తెలుసుకోవాలి. రెడ్డిరాజులు, వారి పరిపాలనా విషయాలు; అనవేమారెడ్డి, పెదకోమటి వేమారెడ్డి, శ్రీనాథుడి గురించి అధ్యయనం చేయాలి.

---

## సందేహాలకు ఆహ్వానం



సచివాలయ పోస్టులకు లక్షలాది మంది పోటీ పడుతున్నారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సందేహాలకు 'ఈనాడు-చదువు' సమాధానాలను అందించనుంది. అభ్యర్థులు సిలబస్, ప్రిపరేషన్, పరీక్షల పరంగా వచ్చే ఇతర ప్రశ్నలను ఈ కింది ఈ-మెయిల్‌కు పంపాలి. **e-mail:** edc@eenadu.in

---

ఆధునిక భారతదేశ చరిత్ర - ఆంధ్రదేశంపై ప్రత్యేక దృష్టి

**పరీక్షలకు తక్కువ సమయం ఉంది. అధ్యయనం వీలైనంత వేగంగా సాగాలి. సమగ్ర అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రతి వాక్యం మార్కుల సాధనకు ఉపయోగపడాలి. ఇదే లక్ష్యంతో రూపొందించిన ఈ సమాచారంతో అభ్యర్థులు తమ విజయావకాశాలను మెరుగుపరుచుకోవచ్చు. యూరోపియన్ల రాకతో అధ్యయనం ప్రారంభించాలి. ఆ సంఘటనలు ఆధునిక భారతదేశ చరిత్రపై ఎలాంటి ప్రభావాన్ని ప్రదర్శించాయో గ్రహించాలి.**



ఆంగ్లేయులు, ఫ్రెంచి వారి మధ్య జరిగిన కర్ణాటక యుద్ధాలకు సంబంధించిన చిత్రం

# వారసత్వం.. ఆధిపత్యం

## యూరోపియన్ల యుద్ధ తంత్రం!

### ఐరోపావారి రాక - వర్తక స్థావరాల స్థాపన

### పోర్చుగీసు వారు

✦ తురుష్కులు 1453లో కాన్‌స్టాంట్‌నోపుల్‌ను ఆక్రమించారు. దీంతో తూర్పు, పశ్చిమ దేశాల మధ్య ఉన్న ఏకైక భూమార్గం మూసుకుపోయింది. పోర్చుగీసువారు తొలిసారిగా కొత్త సముద్రమార్గాలను అన్వేషించడం ప్రారంభించారు.

✦ పోర్చుగల్ రాజు హెన్రీ నావికా శిక్షణ పాఠశాలలు స్థాపించి నావికులను ప్రోత్సహించడంతో బార్తోలామియోడయాజ్ అనే నావికుడు తుపానుల అగ్రం/కేప్ ఆఫ్ గుడ్‌హోప్‌ను కనుక్కున్నాడు.

✦ పోర్చుగల్ నావికుడు వాస్కోడిగామా 1498, మే 17న కేప్ ఆఫ్ గుడ్‌హోప్ ద్వారా వచ్చి కేరళలోని కాలికట్ చేరుకున్నాడు. అక్కడి రాజు జామెరిన్ (రాజా మను విక్రమ వర్మ) పోర్చుగీసువారికి వ్యాపార అనుమతి మంజూరు చేశాడు.



వాస్కోడిగామా

✦ డి ఆల్మడా అనే పోర్చుగీసు గవర్నర్ సముద్ర వ్యాపార ఆధిపత్యం కోసం నీలి నీటి విధానాన్ని ప్రవేశ పెట్టాడు.

✦ 1510లో పోర్చుగీసు గవర్నర్ ఆల్బాకర్క్ శ్రీకృష్ణదేవరాయలుతో సంధి చేసుకున్నాడు. అతడి సాయంతో బీజాపూర్ సుల్తాన్‌ను ఓడించి గోవాను సొంతం చేసుకున్నాడు.

✦ భారతదేశంలో పోర్చుగీసువారి తొలివర్తక స్థావరం కాలికట్. ప్రధాన వర్తక స్థావరం గోవా.

✦ భారతదేశానికి మొదటగా వచ్చిన ఐరోపా దేశం పోర్చుగల్. అయితే ఆంధ్రదేశంలో మాత్రం చివరగా అడుగుపెట్టారు. వీరు 1670లో మచిలీపట్నం (ఆంధ్రా)లో తొలి వర్తక స్థావరాన్ని స్థాపించారు.

✦ ఆంగ్లేయుల చేతిలో ఓడిపోయిన పోర్చుగీసువారు గోవా, డయ్యూ, డామన్‌లను మాత్రమే తమ అధీనంలో ఉంచుకున్నారు. భారత ప్రభుత్వం 1961లో సైన్యాన్ని పంపి ఆపరేషన్ విజయ్ ద్వారా పోర్చుగీసు వారి నుంచి గోవా, డయ్యూ, డామన్‌లను స్వాధీనం చేసుకుంది. అందుకే భారతదేశానికి తొలిసారి వచ్చిన, చివరగా వెళ్లిన ఐరోపా దేశంగా పోర్చుగల్‌ను పేర్కొంటారు.

### డచ్చివారు



బి. నాగరాజు
అసిస్టెంట్ ప్రొఫెసర్

✦ 1605లో డచ్చివారు (నెదర్లాండ్స్/హాలెండ్) మచిలీపట్నం చేరుకుని మహమ్మద్ కులీ కుతుబ్‌షా నుంచి వ్యాపార అనుమతిని పొందారు.

✦ వీరి తొలి వర్తక స్థావరం మచిలీపట్నం. ప్రధాన వర్తక స్థావరం నాగపట్నం. మొదట పులికాట్ వీరికి ప్రధాన వర్తక స్థావరంగా ఉండేది.

✦ ఆంధ్రదేశంలో అడుగుపెట్టిన తొలి ఐరోపా దేశం డచ్ నెదర్లాండ్స్. ✦ డచ్చివారు 10 మంది ఆంగ్ల వర్తకులను చంపిన సంఘటన 1623లో జరిగింది. దీన్నే అంబాయినా వధ అంటారు. నాటి డచ్ గవర్నర్ వాన్‌స్పెల్ట్. ✦ సుగంధ ద్రవ్యాల నుంచి వస్త్ర వ్యాపారంపై దృష్టిపెట్టిన తొలి ఐరోపా దేశం డచ్ నెదర్లాండ్స్. ✦ డచ్‌వారు ఆంధ్రదేశంలోని పేటపోలి (కృష్ణా జిల్లా), నరసాపూర్, భీమునిపట్నం వంటి ప్రాంతాల్లో వర్తక స్థావరాలు స్థాపించారు.

✦ నాటి గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా డచ్‌వారికి వజ్రాల గనులపై గుత్తాధికారాన్ని కల్పించారు. సొంతంగా నాణేలను ముద్రించుకోవడానికి అనుమతి ఇచ్చాడు.

### డెన్మార్క్ వారు

✦ డెన్మార్క్ (డేన్స్)వారు 1615లో తమ తొలి వర్తక స్థావరాన్ని ట్రాంక్విబార్‌లో ఏర్పాటు చేశారు. వీరి ప్రధాన వర్తక కేంద్రాన్ని సేరాంపూర్‌లో నెలకొల్పారు.

### ఫ్రెంచివారు

✦ ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీ 1664లో ఏర్పాటయ్యింది. 1668లో ఔరంగజేబు అనుమతితో ఫ్రెంచివారు తమ తొలి వర్తక స్థావరాన్ని సూరత్‌లో స్థాపించారు. వీరు ఆంధ్రదేశంలో తొలి వర్తక స్థావరాన్ని 1669లో మచిలీపట్నంలో నెలకొల్పారు.

✦ ఫ్రాంకోయిస్ మార్టిన్ అనే ఫ్రెంచి అధికారి వాలికొండాపురం ప్రాంతాన్ని పొంది, అక్కడ పుదుచ్చేరి/ పాండిచ్చేరిని నిర్మించాడు. ఫ్రెంచివారి ప్రధాన వర్తక స్థావరం పుదుచ్చేరి. ✦ వీరు 1708లో యానాం వద్ద వర్తక స్థావరాన్ని నెలకొల్పారు.

✦ ఆంధ్ర దేశానికి వచ్చిన ఐరోపా దేశాలు వరుసగా. . డచ్ నెదర్లాండ్స్, ఆంగ్లేయులు, ఫ్రెంచివారు, పోర్చుగీసువారు.

### ఆంగ్లేయులు

✦ ఆంగ్లేయులు క్రీ.శ.1600లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆఫ్ ఇంగ్లండ్‌ను స్థాపించారు. మొదటి ఎలిజిబెత్ రాణి రాయల్ చార్టర్ చట్టం ద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీకి అనుమతిచ్చారు.

✦ వీరు 1611లో గ్లోబ్ నౌకలో హిప్పన్ నాయకత్వంలో మచిలీపట్నం చేరుకున్నారు. నాటి గోల్కొండ పాలకుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా వారికి వ్యాపార అనుమతి మంజూరు చేశాడు. కానీ వీరు 1621లో వర్తక స్థావరాన్ని ఏర్పాటు చేశారు.



మహమ్మద్ కులీ కుతుబ్‌షా

✦ 1608లో జహంగీర్ ఆస్థానానికి వచ్చిన విలియం హాకిన్స్ (ఆంగ్లేయుడు)కు వ్యాపార అనుమతిని ఇవ్వలేదు.

✦ 1615- 16లో సర్ థామస్ రో అనే ఆంగ్లేయుడు జహంగీర్ ఆస్థానానికి వచ్చి నూర్జహాన్ సహాయంతో వ్యాపార అనుమతిని పొందాడు. తమ తొలి వర్తక స్థావరాన్ని 1616లో సూరత్‌లో నెలకొల్పాడు.

✦ ఆంగ్లేయుల తొలి వర్తక స్థావరం సూరత్. ప్రధాన వర్తక స్థావరం మద్రాస్ (సెయింట్ జార్జి కోట). ✦ ఆంగ్లేయులు ఆంధ్రదేశంలోని పులికాట్ (1621), ఆర్మగం/ ఆర్మగాన్ (1626), నిజాంపట్నం, భీమునిపట్నం (1632), విశాఖపట్నం (1682), ఇంజరం (1708)లో వర్తక స్థావరాలు నెలకొల్పారు. ✦ ఆంగ్లేయులకు ఆంధ్ర దేశంలో అనేక ప్రయోజనాలు కల్పిస్తూ నాటి గోల్కొండ పాలకుడు అబ్దుల్లా కుతుబ్‌షా 1632లో గోల్డెన్ ఫర్మానా జారీ చేశాడు. ✦ ఫ్రాన్సిస్ డే అనే ఆంగ్లేయుడు దామెర్ల సోదరుల నుంచి రెండు గ్రామాలను కొనుగోలు చేసి సెయింట్ జార్జ్ కోటను నిర్మించాడు (చెన్నపట్నం/చెన్నైను నిర్మించాడు).

✦ 1684లో మద్రాస్ ప్రెసిడెన్సీని, 1683లో మద్రాస్ నగరపాలక సంస్థనూ ఏర్పాటు చేసిన ఆంగ్లేయులు 1802లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రాన్ని (వెల్లస్లీ) ఏర్పాటు చేశారు.

✦ ఆంగ్లేయులు కలకత్తాలో విలియం కోటను (జాబ్ చర్నాక్), కడలూరు వద్ద సెయింట్ డేవిడ్ కోటను కట్టించారు. ✦ బొంబాయిని గొప్ప వాణిజ్య కేంద్రంగా జెరాల్డ్ ఆంగియర్ అభివృద్ధి చేశాడు. ✦ 1717లో విలియం హామిల్టన్ అనే ఆంగ్ల వైద్యుడు మొగల్ చక్రవర్తి ఫరూక్ షియర్‌కు వచ్చిన వ్యాధిని నయం చేసి గోల్డెన్ ఫర్మానాను పొందాడు.

### కర్ణాటక యుద్ధాలు

✦ 1740-1763 మధ్యకాలంలో ఆంగ్లేయులు, ఫ్రెంచి వారికి మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి.

✦ 1740-48 మధ్య జరిగిన మొదటి కర్ణాటక యుద్ధానికి కారణం ఆస్ట్రియా వారసత్వ సమస్య. ✦ మొదటి కర్ణాటక యుద్ధం 1746లో కర్ణాటక నవాబు అన్వరుద్దీన్, ఫ్రెంచి గవర్నర్ డూప్లేల మధ్య జరిగింది. ఇదే శాంథోమ్ యుద్ధం. ఈ యుద్ధం 1748లో ఎక్స్-లా-చాపెల్ సంధి ద్వారా ముగిసింది. ✦ రెండో కర్ణాటక యుద్ధం 1749-53 మధ్య జరిగింది. దీనికి కారణం కర్ణాటక, హైదరాబాద్ వారసత్వ తగాదాల్లో ఆంగ్ల, ఫ్రెంచి కంపెనీలు జోక్యం చేసుకోవడం. ✦ నాజర్‌జంగ్ (హైదరాబాద్), అన్వరుద్దీన్ (కర్ణాటక)లను ఆంగ్లేయులు బలపరచగా; ముజఫర్ జంగ్, చందా సాహెబ్‌లను ఫ్రెంచి వారు బలపరిచారు. ✦ మొదట ఫ్రెంచి గవర్నర్ డూప్లే కర్ణాటకపై దండెత్తి, అన్వరుద్దీన్‌ను చంపి చందా సాహెబ్‌ను రాజుగా నియమించాడు. ఇదే 1749 - అంబూరు యుద్ధం. ✦ రాబర్ట్ క్లైవ్ 1752లో కర్ణాటకపై దండెత్తి, ఆర్కాటు పట్టణాన్ని ముట్టడించి చందా సాహెబ్‌ను తొలగించి మహమ్మదాలీని నవాబు చేశాడు. ఈ సమయంలోనే రాబర్ట్ క్లైవ్ 'ఆర్కాటు వీరుడు'గా పేరొందాడు. ✦ హైదరాబాద్‌లో ముజఫర్, నాజర్ జంగ్‌లు హత్యకు గురికావడంతో ఫ్రెంచివారు సలాబత్‌జంగ్‌ను హైదరాబాద్ పాలకుడిగా నియమించారు. సలాబత్‌జంగ్ దానికి ప్రతిఫలంగా ఉత్తర సర్కారులను ఫ్రెంచివారికి ఇచ్చాడు. ✦ బుస్సీ నాయకత్వంలో కొంత సైన్యం హైదరాబాదులో సలాబత్ జంగ్‌కు రక్షణగా నియమితమైంది. ఈయన ప్రమేయంతోనే విజయనగరం, బొబ్బిలి జమీందారుల మధ్య 1757లో బొబ్బిలి యుద్ధం జరిగింది. ✦ రెండో కర్ణాటక యుద్ధం 1753లో పాండిచ్చేరి సంధితో ముగిసింది. ✦ మూడో కర్ణాటక యుద్ధం 1756-63 మధ్య జరిగింది. ఈ యుద్ధానికి కారణం సప్తవర్ష సంగ్రామం (1756-63). మూడో కర్ణాటక యుద్ధం నాటి ఫ్రెంచి గవర్నర్ కౌంట్ డి లాలీ.

✦ ఈ యుద్ధంలో భాగంగా 1758లో చందుర్తి, 1759లో మచిలీపట్నం, 1760లో వందవాసి/ వాండీవాష్ యుద్ధాలు జరిగాయి. ✦ మూడో కర్ణాటక యుద్ధానంతరం సలాబత్‌జంగ్ ఉత్తర సర్కారులను ఆంగ్లేయులకిచ్చాడు. ✦ భారతదేశంలో ఫ్రెంచివారి ప్రాబల్యాన్ని మూడో కర్ణాటక యుద్ధం అంతం చేసింది. ఈ యుద్ధం 1763 నాటి పారిస్ సంధితో ముగిసింది. ✦ ఈ సంధి ద్వారా పాండిచ్చేరి, యానాం తప్ప మిగిలిన ఫ్రెంచి స్థావరాలన్నీ ఆంగ్లేయుల పరమయ్యాయి.

**ఐరోపావారి రాకపై మరింత సమాచారం, నమూనా ప్రశ్నల కోసం క్లిక్ చేయండి.. https://t.ly/kDqmJ**

---

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా... ఐటీ ప్రొఫెషనల్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** డేటా అనలిస్టు-04, డేటా మేనేజర్-02, డేటా ఇంజినీర్-04, బిజినెస్ అనలిస్టు-02, మొబిలిటీ అండ్ ఫ్రంట్ ఎండ్ డెవలపర్-06, ఇంటిగ్రేషన్ ఎక్స్‌పర్ట్-02, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎక్స్‌పర్ట్-04, టెక్నాలజీ ఆర్కిటెక్ట్-01. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీ, అనుభవం. **వయసు:** 25-40 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్/ క్వాలిఫయింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ/ గ్రూప్ డిస్కషన్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 2
**వెబ్‌సైట్:** www.bankofbaroda.in

#### టీఎంసీ - యాక్ట్రెక్

ముంబయిలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ)కి చెందిన అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ (యాక్ట్రెక్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** సైంటిఫిక్ ఆఫీసర్-11, మెడికల్ ఫిజిసిస్ట్-15, నర్సు (ఫిమేల్)-139, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-02, సైంటిఫిక్ అసిస్టెంట్-23. **విభాగాలు:** బయోఇన్ఫర్మేటిక్స్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియో ఫార్మసిస్ట్, రేడియేషన్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హెమటోపాథాలజీ, అనస్థీసియా, సర్జికల్ పాథాలజీ, రేడియో డయాగ్నోసిస్. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 20 వరకు. **హార్డు కాపీలను పంపడానికి చివరితేది:** సెప్టెంబరు 27
**వెబ్‌సైట్:** www.actrec.gov.in

### వాక్-ఇన్స్

#### ఎల్‌పీఎస్‌సీ, తిరువనంతపురం

తిరువనంతపురంలోని భారత అంతరిక్ష విభాగానికి చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది.
**పోస్టు:** టెక్నీషియన్ అప్రెంటిస్ **ఖాళీలు:** 87
**విభాగాలవారీ ఖాళీలు:** మెకానికల్-53, ఎలక్ట్రికల్-07, ఎలక్ట్రానిక్స్-13, కెమికల్-01, కంప్యూటర్ సైన్స్-05, సివిల్-06, ఆటోమొబైల్-02.
**అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
**వయసు:** 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూతేది:** ఆగస్టు 17 **వేదిక:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, ఎర్నాకుళం, కేరళ. **వెబ్‌సైట్:** www.lpsc.gov.in

### కలల కొలువుకు కొన్ని ప్రశ్నలు

✪ ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోయి.. ఎలా ఉన్నా సర్దుకుపోయి.. అసంతృప్తితో అల్లాడటం కంటే జాబ్ వెతుక్కునేటప్పుడే జాగ్రత్తలు పడితే మంచిది కదా. అందుకోసం అయిదు ప్రశ్నలు వేసుకుంటే చాలంటున్నారు నిపుణులు. క్లిక్ చేయండి https://t.ly/Xr1PV

### Dribs and drabs అంటే తెలుసా?

✪ చాలా చిన్న మొత్తాలను ఇంగ్లిష్‌లో ఏమంటారు? మేధస్సుతో పనిచేయడాన్ని ఆంగ్ల భాషలో ఎలా ప్రయోగిస్తారు.. తెలుసుకొని ఉపయోగించడంపై సూచనలు. క్లిక్ చేయండి https://t.ly/VBKYZ

## దరఖాస్తు చేశారా?



● **స్పా విజయవాడలో నాన్ ఫ్యాకల్టీ పోస్టులు**
అర్హత: ఇంటర్, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం; చివరితేది: ఆగస్టు 16

● **ఇండియన్ కోస్టు గార్డులో యాంత్రిక్ పోస్టులు**
అర్హత: పదోతరగతి, ఇంజినీరింగ్ డిప్లొమా; చివరితేది: ఆగస్టు 17

● **ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యుత్ సహాయకులు**
అర్హత: పదోతరగతి, ఐటీఐ/ ఇంటర్ వొకేషనల్; చివరితేది: ఆగస్టు 17